జెన్-జీ పై మోహన్ భగవత్ వ్యాఖ్యలు.. 2
బీజేపీ నేతలకు సీజేపీ అభిజిత్ దీప్కే చురకలు

RNI NO . TELTEL2010/34557
తెలుగు దినపత్రిక

# దేశ టైమ్స్

సత్యం కోసం .... సమాజం కోసం

నల్గొండ | జులై 8 శనివారం 2026 | సంపుటి : 16 | సంచిక : 185 | పేజీలు : 4 | వెల రూ. 2.00/- | ఎడిటర్ : సయ్యద్ పాషా

NALGONDA | SATURDAY AUGUST 8 2026 | VOL:16 | ISSUE: 185 | PAGES:4 | Rs. 2:00 | EDITOR:SAYED PASHA

# తెలంగాణ ప్రభుత్వం

# వర్షాల కోసం వరుణయాగం..

## ముహూర్తం ఫిక్స్




ఆగస్టు 10న నాగార్జునసాగర్‌లో వరుణయాగం

యాగం నిర్వహించనున్న యాదగిరిగుట్ట ఆలయ వేద పండితులు, అర్చకులు

పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొననున్న రేవంత్ రెడ్డి

వర్షాభావ పరిస్థితుల నివారణకు

## ప్రజల కోసం ప్రత్యేక పూజా కార్యక్రమం!

రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి నదులు, జలాశయాలు జలకళ సంతరించుకోవాలని, పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం వరుణ యాగం నిర్వహించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో ఆగస్టు 10వ తేదీన ఉమ్మడి నల్గొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని విజయ విహార్ ప్రాంగణంలో ఈ యాగం వైభవంగా జరగనుంది. ఎల్ నినో ప్రభావం నుంచి విముక్తి కలిగి, కృష్ణా-గోదావరి నదులతో పాటు రైతాంగం సుభిక్షంగా ఉండాలనే ప్రత్యేక సంకల్పంతో ఈ మహా క్రతువును చేపడుతున్నారు. యాదగిరిగుట్ట

(మిగతా 2వ పేజీలో..)

## భయపడొద్దు, నేనున్నాను: టీఎంసీ-శివసేన రెబల్స్‌కు ప్రధాని మోదీ భరోసా

ఎన్డీఏ కొత్త ఎంపీలతో ప్రధాని మోదీ బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్

టీఎంసీ, శివసేన రెబల్ ఎంపీలకు అభయమిచ్చిన ప్రధాని

"ఆందోళన వద్దు, నేను మీతో ఉన్నాను" అంటూ భరోసా

పార్లమెంటు కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనాలని ఎంపీలకు సూచన

ప్రధాని నరేంద్ర మోదీ ఎన్డీయేలోని నూతన మిత్రపక్షాలకు, ముఖ్యంగా తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), శివసేన (ఉద్ధవ్ వర్గం) నుంచి వచ్చిన రెబల్ ఎంపీలకు కీలక భరోసా ఇచ్చారు. "ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు, నేను మీకు అండగా ఉంటాను" అని ఆయన అభయమిచ్చారు. శుక్రవారం ఉదయం తన నివాసంలో



## రూ.5 కోట్ల అంశానికి రూ.54 కోట్ల పెనాల్టీపై మంత్రులు కోమటిరెడ్డి, వివేక్ ఆగ్రహం

రోడ్ల నిర్మాణం, కాంట్రాక్టర్ల ఇబ్బందులపై ఉన్నత స్థాయి సమీక్ష

కాంట్రాక్టర్ ఆత్మహత్యకు కారణమైన అధికారిపై చర్యలు తీసుకోవాలన్న కోమటిరెడ్డి

కాంట్రాక్టర్లను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదని హెచ్చరిక

2



## చెప్పని వాటిని కూడా అమలు చేస్తున్నాం..

అందుకు ఈ పథకమే నిదర్శనం: సీఎం చంద్రబాబు

71,536 చేనేత కుటుంబాలకు రూ. 25,000 చొప్పున ఆర్థిక సాయం

ఎన్నికల్లో చెప్పని హామీని కూడా నెరవేర్చామన్న ముఖ్యమంత్రి

చేనేత వర్గాలకు అందిస్తున్న ఉచిత విద్యుత్, పెన్షన్ పథకాలను వివరించిన సీఎం

రాష్ట్రంలోని చేనేత కార్మికులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు




భరోసా ఇచ్చారు. 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని, బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గం కొత్తపేట గ్రామంలో 'నేతన్న సేవలో' అనే కొత్త పథకాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 71,536 చేనేత కుటుంబాలకు రూ. 25,000

(మిగతా 2వ పేజీలో..)

## సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ!

జాతీయ చేనేత దినోత్సవం వేళ రేవంత్‌కు కేటీఆర్ లేఖ

నేతన్న బీమా, నేతన్నకు చేయూత వంటి కార్యక్రమాలను ఆపేశారని మండిపాటు

రద్దు చేసిన సంక్షేమ పథకాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్

జాతీయ చేనేత దినోత్సవం వేళ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వేలాది చేనేత కుటుంబాలకు ఆర్థిక ధీమానిచ్చిన 'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' వంటి గొప్ప పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసి నేతన్నలను కోలుకోలేని దెబ్బతీసిందని తన లేఖలో ఆయన మండిపడ్డారు. బతుకమ్మ

(మిగతా 2వ పేజీలో..)





తెలుగు దినపత్రిక
దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

# సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ!

మొదటి పేజీ తరువాయి)

చీరలు, స్కూల్ యూనిఫారాల తయారీ ఆర్డర్లను పక్కనబెట్టి, కమీషన్ల కోసం ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిన రూ.18 వేల ఆర్థిక సాయం, రూ.లక్ష వ్యక్తిగత రుణమాఫీ, 5 శాతం జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేటీఆర్ దుయ్యబట్టారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బోర్డులను రద్దు చేసి, జీఎస్టీ విధించి దెబ్బతీస్తే.. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న పథకాలను నిలిపివేసి నేతన్నలను మోసం చేసిందని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా కక్షపూరిత వైఖరి వీడి, రద్దు చేసిన పథకాలను తక్షణమే పునరుద్ధరించి నేతన్న కుటుంబాలకు అండగా నిలవాలని ఆయన డిమాండ్ చేశారు.

## రూ.5 కోట్ల అంశానికి రూ.54 కోట్ల పెనాల్టీపై మంత్రులు కోమటిరెడ్డి, వివేక్ ఆగ్రహం

మొదటి పేజీ తరువాయి)

రోడ్డు పనులు చేపట్టే చిన్న కాంట్రాక్టర్లపై మైనింగ్ శాఖ అధికారులు పది రెట్ల వరకు అతిగా పెనాల్టీలు విధించడంపై రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ సచివాలయంలో రహదారుల నిర్మాణం, కాంట్రాక్టర్ల ఇబ్బందులపై జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో వారు మాట్లాడారు. రూ.5 కోట్ల విలువైన అంశానికి ఏకంగా రూ.54 కోట్లు పెనాల్టీ విధించడం అత్యంత దారుణమని, కాంట్రాక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఆత్మహత్యకు కారణమైన అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి వివేక్‌ను కోమటిరెడ్డి కోరారు. అక్రమ మైనింగ్ చేసేవారిని వదిలేసి, రోడ్ల పనులు చేసే అమాయక కాంట్రాక్టర్లను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదని మంత్రులు హెచ్చరించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హ్యామ్ మోడల్ రోడ్ల పనులను వేగవంతం చేసి, 2028 నాటికి రాష్ట్రంలో అద్దం లాంటి రోడ్లు నిర్మించడమే లక్ష్యమని కోమటిరెడ్డి స్పష్టం చేశారు. రోడ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక, మెటల్ పర్మిషన్ల పేరుతో వేధించవద్దని, కాంట్రాక్టర్ల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని మైనింగ్ శాఖ అధికారులను మంత్రి వివేక్ ఆదేశించారు.

## భయపడొద్దు, నేనున్నాను: టీఎంసీ-శివసేన రెబల్స్‌కు ప్రధాని మోదీ భరోసా

మొదటి పేజీ తరువాయి)

సుమారు 45 మంది ఎన్డీయే ఎంపీలతో ఏర్పాటు చేసిన అల్పాహార సమావేశంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు పదేపదే అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశంలో తృణమూల్ రెబల్స్‌తో ఏర్పడిన నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ), ఉద్ధవ్ ఠాక్రే వర్గం నుంచి ఏక్‌నాథ్ షిండే వర్గంలో చేరిన శివసేన ఎంపీలు, ఎన్సీపీ (అజిత్ పవార్) సభ్యులు పాల్గొన్నారు. సభలో గందరగోళం కారణంగా కొత్త ఎంపీలకు మాట్లాడే అవకాశం రాకపోవడం అన్యాయమని ప్రధాని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, పార్లమెంటును ప్రజాస్వామ్య దేవాలయంగా అభివర్ణించారు. సభా కార్యకలాపాలు సజావుగా సాగాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. పార్లమెంటు చరిత్రను అధ్యయనం చేసి, చర్చలకు సిద్ధం కావాలని ఎంపీలకు సూచించారు. రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశం పురోగమిస్తుందని పేర్కొంటూ, తమ నియోజకవర్గాల అభివృద్ధి పనుల నిమిత్తం నేరుగా ప్రధానమంత్రి కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. "ఎన్డీయే ఒక కుటుంబం. కూటమిలోని ప్రతి పార్టీకి, ప్రతి ఎంపీకి తగిన గౌరవం ఉంటుంది. నేను ప్రతి ఎంపీకి అండగా ఉంటాను" అని మోదీ హామీ ఇచ్చారు. అనంతరం ఆయన ప్రతి ఒక్కరితో వ్యక్తిగతంగా మాట్లాడారు. ముఖ్యంగా మహారాష్ట్రకు చెందిన షిండే వర్గం ఎంపీలతో మరాఠీలో సంభాషించడం విశేషం.

## సీఎం విజయ్ విడాకుల కేసులో కీలక మలుపు.. కేసు వాపస్ తీసుకున్న భార్య సంగీత

తమిళనాడు రాజకీయ మరియు సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన ముఖ్యమంత్రి విజయ్ కుటుంబ వివాదానికి సంబంధించి ఒక ముఖ్యమైన పరిణామం వెలుగులోకి వచ్చింది. సీఎం విజయ్ సతీమణి సంగీత, చెంగల్పట్టు జిల్లా కుటుంబ న్యాయస్థానంలో గతంలో దాఖలు చేసిన విడాకుల పిటిషన్‌ను అధికారికంగా వెనక్కి తీసుకున్నట్లు తెలుస్తుంది. సంగీత తన విడాకుల పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు న్యాయస్థానానికి తెలపడంతో, ఇరువర్గాల వాదనలను పరిశీలించిన చెంగల్పట్టు డిస్ట్రిక్ట్ కోర్టు ఈ కేసుకు సంబంధించి తుది ఉత్తర్వులు వెలువరించింది. పిటిషన్ ఉపసంహరణను పరిగణలోకి తీసుకున్న న్యాయస్థానం, ఈ విడాకుల కేసుకు సంబంధించి ప్రొసీడింగ్స్‌ను పూర్తిగా ముగిస్తున్నట్లు (ఐఅంజూశీంవస శీట) ప్రకటించింది. తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన విజయ్ వ్యక్తిగత జీవితానికి సంబంధించి గత కొంతకాలంగా వివిధ రకాల వూహాగానాలు, వార్తలు ప్రచారంలో ఉన్నాయి. అయితే, సంగీత స్వయంగా కోర్టులో పిటిషన్‌ను ఉపసంహరించుకోవడంతో ఈ హైప్రొఫైల్ కుటుంబ వివాదానికి తాత్కాలికంగా తెరపడినట్లయింది. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలు అధికారికంగా వెలువడాల్సి ఉంది.




# చెప్పని వాటిని కూడా అమలు చేస్తున్నాం..

మొదటి పేజీ తరువాయి)

చొప్పున ఆర్థిక సహాయం అందించేందుకు రూ. 179 కోట్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, స్వదేశీ ఉద్యమ స్ఫూర్తిని గుర్తుచేసుకునే ఆగస్టు 7వ తేదీని మరపురాని రోజుగా మార్చాలనే సంకల్పంతో ఈ పథకాన్ని ప్రారంభించామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాకుండా, చెప్పని వాటిని కూడా అమలు చేస్తున్నామనడానికి 'నేతన్న సేవలో' పథకమే నిదర్శనమని ఆయన స్పష్టం చేశారు. చేనేత కేవలం ఒక వృత్తి కాదని, అది భారతీయ సంస్కృతికి, దేశం గర్వించదగ్గ కళకు ప్రతీక అని కొనియాడారు. ఒకప్పుడు చేనేత ఉత్పత్తులతో 'మినీ ముంబై'గా పేరుగాంచిన చీరాలకు తిరిగి పూర్వ వైభవం తీసుకొస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చేనేత వర్గాల సంక్షేమానికి పలు పథకాలు అమలు చేస్తోందని చంద్రబాబు వివరించారు. చేనేత కార్మికులకు 50 ఏళ్లకే ఎన్టీఆర్ భరోసా కింద రూ. 4,000 పింఛను అందిస్తున్నామని, దీని ద్వారా 85 వేల మందికి ఏటా రూ. 420 కోట్లు అందిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా, చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్‌లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామని, దీనివల్ల 62,541 చేనేత కుటుంబాలు, 10,032 పవర్‌లూమ్ యూనిట్లు లబ్ధి పొందుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలోని 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ రూపంలో రూ. 79 కోట్లు అందించామన్నారు. చేనేత రంగ అభివృద్ధికి ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకెళుతోందని ముఖ్యమంత్రి తెలిపారు. స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద రూ. 10 కోట్లతో 10 చేనేత క్లస్టర్లకు ఆమోదం తెలిపామని, హ్యాండ్లూమ్ మార్కెటింగ్ అసిస్టెన్స్ కార్యక్రమం ద్వారా కార్మికులకు నేరుగా మార్కెట్ అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్కు, ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు, అమరావతిలోని శాఖమూరులో చేనేత, హస్తకళల మ్యూజియం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. విశాఖపట్నంలో రూ. 4,200 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు కానున్న టెక్స్‌టైల్ రీసైక్లింగ్ యూనిట్ ద్వారా చేనేత రంగానికి మరింత ఊపు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సవిత, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాగ్‌రాజ్‌లో రాహుల్ గాంధీ సభకు లైన్ క్లియర్..

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహించతలపెట్టిన 'ఛాత్రోన్ కీ గూంజ్' సదస్సుకు ఏర్పడిన ఆటంకాలు తొలగిపోయాయి. సభా వేదిక అయిన కేపీ గ్రౌండ్‌కు గతంలో ఇచ్చిన అనుమతిని రద్దు చేసి తీవ్ర ఉత్కంఠకు కారణమైన కాయస్థ పాఠశాల ట్రస్ట్.. గురువారం అర్ధరాత్రి వెనక్కి తగ్గింది. కొన్ని షరతులతో సభ నిర్వహణకు మళ్లీ అనుమతి ఇస్తున్నట్లు ప్రకటించింది. విద్యార్థులు, యువత ఎదుర్కొంటున్న పేపర్ లీకేజీలు, నిరుద్యోగం వంటి సమస్యలపై ఆగస్టు 8న ప్రయాగ్‌రాజ్‌లో రాహుల్ గాంధీ ముఖాముఖి నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ ఏర్పాట్లు చేసింది. అయితే, కేపీ కాలేజ్ మైదానాన్ని కేవలం క్రీడలు, విద్యా సంబంధిత కార్యక్రమాలకే వాడాలన్న అలహాబాద్ హైకోర్టు పాత ఆదేశాలను, వర్షం కారణంగా మైదానంలో నీరు చేరిందన్న కారణాన్ని చూపుతూ కేపీ ట్రస్ట్ బుధవారం అకస్మాత్తుగా అనుమతిని రద్దు చేసింది. ఈ నిర్ణయంపై కాంగ్రెస్ శ్రేణులు తీవ్రంగా స్పందించాయి. రాహుల్ సభను అడ్డుకునేందుకే బీజేపీ ప్రభుత్వం పరిపాలన యంత్రాంగంపై ఒత్తిడి తెస్తోందని ఆరోపించాయి. వేదిక అనుమతి రద్దయినా, రాహుల్ గాంధీ ప్రయాగ్‌రాజ్ పర్యటన యథాతథంగా కొనసాగుతుందని ఏఐసీసీ, యూపీ కాంగ్రెస్ నాయకత్వం స్పష్టం చేసింది. కాంగ్రెస్ ఆరోపణలు, న్యాయపరమైన



అంశాలపై చర్చించిన అనంతరం కేపీ ట్రస్ట్ తన నిర్ణయాన్ని మార్చుకుంది. హైకోర్టు న్యాయవాదులతో సంప్రదించిన తర్వాత సభకు అనుమతి ఇవ్వాలని నిర్ణయించినట్లు ట్రస్ట్ తాత్కాలిక అధ్యక్షుడు జితేంద్ర నాథ్ చౌదరి తెలిపారు. అయితే, ఇందుకు రెండు ప్రధాన షరతులు విధించారు. మొదటిది, కార్యక్రమం వల్ల కాలేజీలోని తరగతులకు ఎలాంటి ఆటంకం కలగకూడదని, రెండవది, ప్రయాగ్‌రాజ్ జిల్లా మేజిస్ట్రేట్ (డీఎం) నుంచి తప్పనిసరిగా చట్టబద్ధమైన అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు.

# వర్షాల కోసం తెలంగాణ ప్రభుత్వం వరుణయాగం.. ముహూర్తం ఫిక్స్

మొదటి పేజీ తరువాయి)

శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన వేద పండితులు, అర్చకులతో పాటు మొత్తం 108 మంది రుత్వికులు 11 హోమకుండాలలో ఈ యాగాన్ని నిర్వహించనున్నారు. యాగ పూర్ణాహుతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యక్షంగా పాల్గొననున్నారు. రాష్ట్ర శ్రేయస్సును కాంక్షిస్తూ ఈ మహా వరుణ యాగాన్ని నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారని యాదగిరిగుట్ట దేవస్థానం పాలక మండలి చైర్మన్ తెలిపారు.

## జెన్–జీ పై మోహన్ భగవత్ వ్యాఖ్యలు.. బీజేపీ నేతలకు సీజేపీ అభిజిత్ దీప్కే చురకలు

బీజేపీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) మధ్య సమన్వయం లోపించిందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే విమర్శించారు. జెన్–జీ యువతపై ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలను బీజేపీ నేతలు పరిగణనలోకి తీసుకోవాలని ఆయన సూచించారు. శుక్రవారం మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముంబైలో జెన్–జీ, జెన్–ఆల్ఫా విద్యార్థులతో జరిగిన కార్యక్రమంలో మోహన్ భగవత్ చేసిన ప్రసంగాన్ని ఈ సందర్భంగా దీప్కే ప్రస్తావించారు. "నిరసనలు తెలుపుతున్న జెన్–జీ యువత దేశ వ్యతిరేకులు కాదు, వారి ఆందోళనల్లో నిజాయతీ ఉంది, వారికి నిరసన తెలిపే హక్కు ఉంది" అని మోహన్ భగవత్ స్పష్టం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. బీజేపీకి మార్గదర్శిగా ఉన్న భగవత్ మాటలను ఆ పార్టీ నాయకత్వం వినాలని హితవు పలికారు. గతంలో జంతర్ మంతర్ వద్ద నిరసనలు జరిగినప్పుడు బీజేపీ నేత నితిన్ నబిన్ ఆందోళనకారులను 'వైరస్' అని, కేంద్ర మాజీ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ 'ఉగ్రవాదుల బీ టీమ్' అని వ్యాఖ్యానించిన విషయాన్ని అభిజిత్ దీప్కే గుర్తు చేశారు. వారి మార్గదర్శి మాటలనే బీజేపీ నేతలు ఖాతరు చేయకపోవడం సరికాదని ఆయన అన్నారు. ఈ అంశంపై మోహన్ భగవత్ నేరుగా బీజేపీ నాయకత్వంతో మాట్లాడాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ భిన్నమైన వైఖరులు విస్తృత సంఘ్ పరివార్‌లో ఉన్న అంతర్గత విభేదాలను సూచిస్తున్నాయని అభిజిత్ దీప్కే పేర్కొన్నారు. తమ పార్టీ ఏ రాజకీయ భావజాలానికి కట్టుబడి ఉండదని, కేవలం దేశం, యువతకు సంబంధించిన సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే బృందంగా పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు.



తెలుగు దినపత్రిక
దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం
ఆగస్టు । శనివారం । 8 । 2026


# తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కారం

**ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమం**

**మహబూబాబాద్/మరిపెడ, ఆగస్టు 7(దేశ టైమ్స్)**

పుట్టిన ప్రతి శిశువుకు తల్లిపాలే ఉత్తమమైన ఆహారమని, తల్లిపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని బీసీ-2 అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భిణీలు, చిన్నారుల తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, పుట్టిన శిశువుకు తొలి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలు మాత్రమే అందించాలని సూచించారు. ఇలా చేయడం వల్ల శిశువు ఆరోగ్యంగా ఎదగడమే కాకుండా శారీరక, మానసిక వికాసం మెరుగ్గా ఉంటుందని తెలిపారు. పుట్టిన గంటలోపే బిడ్డకు ఇచ్చే పసుపు రంగు ముర్రుపాలు (కొలస్ట్రం) సహజ రోగనిరోధక శక్తిని పెంపొందించి, అనేక ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయని వివరించారు. తల్లిపాలు తాగే పిల్లల్లో సీజనల్ వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశాలు కూడా తక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రతి తల్లి తన బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు



అందించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు షహాదా, శ్రీలత, సునీత, పుష్ప, వెంకటలక్ష్మి, వసుమతి, పద్మ, అంగన్‌వాడీ ఆయా యాకుబీ, ఏఎన్ఎం నాగమణి, ఆశా వర్కర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు





**పాలనలో రాజకీయాలకు తావులేదు**

**ఆగస్టు 15 నుంచి ఆసరా పింఛన్లు**

**తిరుమలాయపాలెంలో రూ. 7.00 కోట్ల పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన**

తిరుమలాయపాలెం : అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయాలకు అతీతంగా ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన తిరుమలాయపాలెం మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా తిప్పారెడ్డిగూడెం నుంచి రాకాసితండా వరకు రూ. 2.10 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు, రాజారాం నుంచి తుమ్మగూడెం వరకు రూ. 4.50 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే హైదర్ సాయిపేట, పాతర్లపాడు గ్రామాల్లో రూ. 20 లక్షల చొప్పున అంచనా వ్యయంతో నిర్మించనున్న పంచాయతీ భవనాలకు భూమిపూజ నిర్వహించారు.

**సమగ్ర అభివృద్ధే ధ్యేయం..**

ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రభుత్వం సమపాళ్లలో పరుగులు తీయిస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల స్వరూపాన్ని మార్చేందుకు భారీగా నిధులు కేటాయిస్తున్నామని వెల్లడించారు. తిప్పారెడ్డిగూడెం అభివృద్ధికి ఇప్పటివరకు రూ. 35.55 కోట్లు, హైదర్ సాయిపేటకు రూ. 37 కోట్లు, పాతర్లపాడుకు రూ. 29.25 కోట్లు, రాజారాం గ్రామానికి రూ. 8.48 కోట్లు మంజూరు చేసి వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. ఉచిత విద్యుత్, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, సన్న బియ్యం పంపిణీ ద్వారా పేద



కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించామన్నారు. రైతాంగానికి మద్దతు ధరతో పాటు వరికి క్వింటాలుకు రూ. 500 బోనస్, ఎకరాకు రూ. 6 వేల రైతు భరోసా జమ చేశామని గుర్తుచేశారు.

**ఇందిరమ్మ ఇళ్లు పారదర్శకం..**

పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా విడతల వారీగా 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఎవరికీ ఒక్క రూపాయి చెల్లించాల్సిన అవసరం లేదని, పూర్తి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. ప్రతి సోమవారం క్షేత్రస్థాయి ప్రగతి ఆధారంగా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే బిల్లులు జమ చేస్తామని స్పష్టం చేశారు. త్వరలోనే రెండో విడత ప్రొసీడింగ్స్ అందజేస్తామన్నారు. ఆగస్టు 15 నుంచి నూతన ఆసరా పింఛన్ల మంజూరు ప్రక్రియ ప్రారంభమవుతుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్‌రెడ్డి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, డిపిఓ వినోద్‌మార్, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ విల్సన్, ఎంపీడీఓ సిలార్ సాహెబ్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# వలిగొండలో ఘనంగా కుంభం కీర్తి రెడ్డి జన్మదిన వేడుకలు

**వలిగొండ: ఆగస్టు 7(దేశ టైమ్స్);**

భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కూతురు కాంగ్రెస్ పార్టీ నాయకురాలు కుంభం కీర్తి రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం వలిగొండ మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ నాయకుడు బత్తిని నాగేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు కుంభం కీర్తి రెడ్డి ఫ్లెక్సీని ఏర్పాటు చేసి కేకు కట్ చేసిన అనంతరం ప్రజలకు పండ్లు బ్రెడ్ పంపిణీ చేశారు ఈ సందర్భంగా నగేష్ గౌడ్ మాట్లాడుతూ యువ నాయకురాలు కీర్తి రెడ్డి ఇలాంటి జన్మదిన వేడుకలు ఎల్లప్పుడు జరుపుకోవాలని ఆకాంక్షించారు నియోజకవర్గప్రజలలో మంచి పేరు ఉండి దూసుకుపోతున్న కీర్తి రెడ్డి రాజకీయాలలో రాణించి ఉన్నత పదవులను పొందాలని నాగేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాశంసత్తిరెడ్డి వలిగొండ సింగల్ విండో చైర్మన్ గరిసె రవి వైస్ చైర్మన్ జంగారెడ్డి వలిగొండ ఉప సర్పంచ్ మలుగ మాధవి వెంకటేష్ నాయకులు పలుసం సతీష్ గౌడ్ కొండూరు భాస్కర్ గంగాపురం సతీష్ గౌడ్ సామ రామ్ రెడ్డివలిగొండ పట్టణ అధ్యక్షుడు పోలేపాక జానకి రాములు గంగదారి రాములు బత్తిని లింగయ్య పబ్బు సురేందర్ కాసుల వెంకన్నకొండూరు సాయి ఎమ్మే లింగస్వామి రాపోలు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు




## సోమిరెడ్డికి ఘన నివాళి

**మహబూబాబాద్/మరిపెడ ఆగస్టు 7 (దేశ టైమ్స్)**



మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన వెలమరెడ్డి సోమిరెడ్డి అనారోగ్యంతో కన్నుమూయడంతో ఆయన మృతి పట్ల పలువురు నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించిన మహబూబాబాద్ జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు, అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు సూచిస్తూ, సోమిరెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 13వ వార్డు కౌన్సిలర్ గంట్ల సుజాత--మైపాల్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, నర్సిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, గోపాల్ రెడ్డి, గంట్ల రామన్నతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొని సోమిరెడ్డికి ఘనంగా నివాళులర్పించారు.

## కురవిలో పోస్ట్ మెట్రిక్ హాస్టల్ భవనానికి శంకుస్థాపన

**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్**

**మహబూబాబాద్ ఆగస్టు 7 (దేశ టైమ్స్)**



మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్మించను న్న పోస్ట్ మెట్రిక్ హాస్టల్ భవన నిర్మాణ పనులకు ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పోస్ట్ మెట్రిక్ హాస్టల్ నిర్మాణం పూర్తయిన అనంతరం విద్యార్థులు సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణంలో విద్యాభ్యాసం కొనసాగించే అవకాశం కలుగుతుందని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో విద్యాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న ఎమ్మెల్యే, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. విద్య ద్వారా గిరిజన యువత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, విద్యార్థులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విలేకరి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన షైన్ హైస్కూల్ కరెస్పాండెంట్ షేక్ అన్సర్ పాషా

**ఖమ్మం ప్రతినిధి ,ఆగస్టు 07:**

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండలానికి చెందిన విజన్ ఆంధ్రా దినపత్రిక విలేకరి మందా సత్యనందం కుటుంబాన్నీ శుక్రవారం షైన్ హై స్కూల్ కరస్పాండెంట్ షేక్ అన్సర్ పాషా,డైరెక్టర్లు లాల్ మహమ్మద్,సిరి ఫర్హాద్ లు పరామర్శించారు,విలేకరి సత్యానందం మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు,అనంతరం సత్యానందం సతీమణికి 5వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో షైన్ హై స్కూల్ ప్రిన్సిపల్ అయిటి పాముల శ్వేత,అడ్మినిస్ట్రేటర్ దేగల వేలాద్రి,షేక్ ఖాజా పాషా తదితరులు ఉన్నారు.

## బొమ్మ సత్య ప్రసాద్ కు నివాళులు అర్పించిన మాజీ మంత్రి పువ్వాడ..

**ఖమ్మం ప్రతినిధి ఆగష్టు 07(దేశ టైమ్స్)**

బొమ్మ విద్యాసంస్థల అధినేత బొమ్మ రాజేశ్వరరావు కుమారుడు బొమ్మ సత్య ప్రసాద్ అనారోగ్యంతో పరమాపదించారు.వారి పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించిన మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ..వారి కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.సత్య ప్రసాద్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.



తెలుగు దినపత్రిక
దేశ టైమ్స్
సత్యం కోసం .... సమాజం కోసం

# ఎమ్మెల్యే కుంభం సొంత నిధులతో గుర్రపు డెక్క ఆకుతొలగింపు



**వలిగొండ ఆగస్టు7(దేశ టైమ్స్):**

భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి స్వంతనిధులతో భీమ లింగం కాలువ వెంట గుర్రపు డెక్క ఆకును హిటాచి యంత్రం ద్వారా తొలగిస్తున్నారు వలిగొండ చెరువు నుండి మొదలుకొని మల్లెపల్లి వెలవర్తి మొగిలిపాక మీదుగా ముద్దపురం వరకు కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్కే ఆకును తొలగించేందుకు శుక్రవారం శ్రీకారం చుట్టారు భీమలింగం కాలువ పరిధిలోని రైతులు గుర్రపు డెక్క ఆకుతో దిగువ ప్రాంత రైతులకు సాగునీరు సక్రమంగా అందడం లేదని ఆకును తొలగిస్తేనే సాగునీరు అందుతుందని ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డిని కలిసి ఆకును తొలగించాలని కోరడం తో ఆయన వెంటనే స్పందించి తొలగింపు చర్యలు చేపడుతానని హామీ ఇచ్చారు ఇచ్చిన హామీ మేరకు శుక్రవారం వలిగొండ చెరువు వద్ద ఎమ్మెల్యే ఆదేశాలతో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ ఆధ్వర్యంలో హిటాచి వద్ద కొబ్బరికాయ కొట్టి ఆకుల తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు ఈ ఆకు తొలగింపుతో దిగువ ప్రాంత రైతులకు సాగునీరంది బీడు పడిన భూములు సశశ్యామలం కానున్నాయి ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ స్థానిక సర్పంచ్ కుంభం వెంకట్ పాపిరెడ్డిబ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి వలిగొండ సింగిల్ విండో చైర్మన్ గరిసే రవి వైస్ చైర్మన్ జంగారెడ్డి నాయకులు పలుసం సతీష్ గౌడ్ గంగాపురం సతీష్ గౌడ్ కంచనపల్లి ముద్దాపురం గ్రామాల సర్పంచులు రేస్ బుచ్చిరెడ్డి సామ రామ్ రెడ్డి బత్తిని లింగయ్య పబ్బు సురేందర్ గౌడ్ కాసుల వెంకన్న గౌడ్ కొండూరు సాయి చిలుకూరుసత్తిరెడ్డి రైతులు పాల్గొన్నారు

# కొత్త ఇన్నింగ్స్ మొదలుపెట్టిన అజింక్యా రహానే



భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ అజింక్యా రహానే తన కెరీర్‌లో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించాడు. అంత ర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన వెంటనే, యూరోపి యన్ టీ20 ప్రీమియర్ లీగ్ (ఈటీపీఎల్)లో అడుగుపెట్టాడు. ఈ లీగ్ తొలి ఎడిషన్ కోసం అమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్ ఫ్రాంచైజీకి కీలక ఆటగాడిగా రహానే సంతకం చేశాడు. ఈ విషయాన్ని ఫ్రాంచైజీ యాజమాన్యం నేడు అధికారికంగా వెల్లడించింది.ఐసీసీ ఆమోదం పొందిన యూరప్‌లోని మొట్టమొదటి టీ20 లీగ్ ఇదే కావడం విశేషం. ఈ లీగ్ తొలి సీజన్ ఈ నెల 26 నుంచి సెప్టెంబర్ 20 వరకు జరగనుంది. ఇందులో గ్లాస్గో, అమ్‌స్టర్‌డామ్, ఎడిన్‌బర్గ్, డబ్లిన్, బెల్ఫాస్ట్, రోటర్‌డామ్ నగరాలకు చెందిన ఆరు ఫ్రాంచైజీలు పోటీ పడనున్నాయి.భారత్ తరఫున 85 టెస్టులు, 90 వన్డేలు, 20 టీ20 మ్యాచ్‌లు ఆడిన రహానేకు అపారమైన అనుభవం ఉంది. ఐపీఎల్‌లో 212 మ్యాచ్‌లు ఆడి, ఇటీవలి సీజన్లలో కోల్‌కతా నైట్ రైడర్స్‌కు నాయకత్వం వహించాడు. రహానే చేరికపై అమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ వా హర్షం వ్యక్తం చేశాడు. రహానే నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు, వినయం జట్టుకు ఎంతో మేలు చేస్తాయని అన్నాడు.యూరప్‌లో క్రికెట్ అభివృద్ధికి తన వంతు సహకారం అందించడం, ఒక విజయవంతమైన ఫ్రాంచైజీని నిర్మించడంలో పాలుపంచుకోవడం సంతోషంగా ఉందని రహానే పేర్కొన్నాడు. ఈ కొత్త లీగ్‌కు రహానే వంటి స్టార్ ఆటగాడి రాక మంచి బూస్ట్ ఇస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# భావోద్వేగభరితంగా 'విశ్వనాథ్ & సన్స్' ట్రైలర్ !

**సూర్య 'విశ్వనాథ్ అండ్ సన్స్' ట్రైలర్ విడుదల**

**ట్రైలర్‌లో ఆకట్టుకునే భావోద్వేగాలు**

**ఆలోచింపజేసే సంభాషణలు**

**ఆగస్టు 14న చిత్రం విడుదల**



తమిళ కథానాయకుడు సూర్య నటిస్తున్న స్ట్రయిట్ తెలుగు చిత్రం 'విశ్వనాథ్ & సన్స్' వెంకీ అట్లూరి దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంస్థలు సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఆగస్టు 14, 2026న ప్రపంచవ్యాప్తంగా చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా ఈ చిత్రం ట్రైలర్‌ను శుక్రవారం (నేడు) విడుదల చేశారు మేకర్స్. ట్రైలర్‌ను గమనిస్తే ఫ్యామిలీ ఎమోషన్స్‌తో రూపొందుతోన్న కుటుంబ కథా చిత్రంగా 'విశ్వనాథ్ & సన్స్' ప్రేక్షకుల ముందుకు రాబోతుందనే విషయాన్ని ట్రైలర్ ద్వారా మేకర్స్ మరోసారి స్పష్టం చేశారు. 'నా బాబు ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ కొట్టాలి' అంటూ రాధికా శరత్ కుమార్ డైలాగ్ నుంచి, గెలిచే వరకు ఆగకూడదు.. గెలిచిన తరువాత ఆ గెలుపు గురించి ఎక్కువ మాట్లాడకూడదు అంటూ సూర్య చెప్పే డైలాగ్ వరకు ట్రైలర్ ఆద్యంతం ఎంతో భావోద్వేగభరితంగా అనిపిస్తుంది. 'నీ సీటు చాలా స్ట్రాంగ్', 'ఇప్పుడు ఎందుకు చంద్రముఖిలో జ్యోతికలా బిహేవ్ చేస్తున్నావు' అంటూ కథనాయిక మమితా బైజు సూర్యను టీజ్ చేస్తూ చెప్పే సంభాషణలు ఫన్నీగా అనిపించాయి. ట్రైలర్‌లో ఎమోషన్స్, సెన్సిటివ్ ఎంటర్‌టైన్‌మెంట్, సెంటిమెంట్ ఇలా అన్నీ మిక్స్ చేసి దర్శకుడు సినిమా కథాంశాన్ని ఆడియన్స్‌కు ట్రైలర్ ద్వారా హింట్ ఇచ్చే ప్రయత్నం చేశాడు. నలభై ఏళ్ల వయసులో అంతర్జాతీయ పిస్టల్ షూటర్‌గా సూర్య ఎలా ఎదిగాడు? అనే అంశాన్ని ఈ చిత్రంలో చూపించబోతున్నారు. ట్రైలర్‌తో ఆసక్తి కలిగించి సినిమా గురించి వెయిట్ చేసే విధంగా దర్శకుడు వెంకీ అట్లూరి చేసిన ట్రైలర్ కట్ బాగుంది. జీవీ ప్రకాష్ కుమార్ నేపథ్య సంగీతం ఆహ్లాదంగా అనిపించింది.

# 'ధురంధర్' ప్రభంజనం.. వరల్డ్ నెం.1 నాన్-ఇంగ్లీష్ చిత్రంగా రికార్డ్

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' అంతర్జాతీయ స్థాయిలో అరుదైన ఘనతను దక్కించుకుంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా అత్యధిక వీక్షణలు పొందిన నాన్-ఇంగ్లీష్ చిత్రంగా ఈ సినిమా రికార్డు సృష్టించింది. ఈ విషయాన్ని నెట్‌ఫ్లిక్స్ కో-సీఈవో టెడ్ సరాండోస్ వెల్లడించారు. 'ఎక్స్‌ప్రెస్ అడ్డా' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, , ఈ ఏడాది అమెరికా, యూకే చిత్రాల తర్వాత అంతర్జాతీయంగా అత్యధిక వ్యూస్ సాధించిన చిత్రంగా 'ధురంధర్' నిలిచిందని పేర్కొన్నారు. గణాంకాల ప్రకారం, 2026 జనవరి నుంచి జూన్ మధ్య కాలంలో ఈ సినిమా ఏకంగా 37 మిలియన్ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. ఏకకాలంలో 22 దేశాల్లో నెట్‌ఫ్లిక్స్ చార్టులలో ఈ చిత్రం అగ్రస్థానంలో నిలవడం విశేషం. ఆదిత్య ధర్ దర్శకత్వంలో రెండు భాగాలుగా రూపొందిన ఈ ఫ్రాంచైజీ, ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద రూ. 3,100 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను రాబట్టి సత్తా చాటింది. 2025 డిసెంబర్‌లో విడుదలైన మొదటి భాగం ఘనవిజయం సాధించగా, ఈ ఏడాది మార్చిలో వచ్చిన సీక్వెల్ 'ధురంధర్: ది రివెంజ్' భారత్‌లో రూ. 1,000 కోట్ల నెట్ వసూళ్లు సాధించిన తొలి బాలీవుడ్ చిత్రంగా చరిత్ర సృష్టించింది. భారతీయ కంటెంట్‌కు అంతర్జాతీయంగా ఆదరణ విపరీతంగా పెరుగుతోందని టెడ్ సరాండోస్ కొనియాడారు. 2024 నుంచి ప్రతీ వారం ఏదో ఒక భారతీయ సినిమా లేదా సిరీస్ నెట్‌ఫ్లిక్స్ గ్లోబల్ టాప్-10 జాబితాలో స్థానం సంపాదించుకుంటోందని ఆయన గుర్తుచేశారు. 'స్క్విడ్ గేమ్' లేదా 'మనీ హీస్ట్' వంటి భారీ గ్లోబల్ హిట్స్ భారత్ నుంచి ఎప్పుడు వస్తాయని చాలామంది అడుగుతుంటారని, అయితే భారతీయ చిత్రాలు ఇప్పటికే ఆ స్థాయి ఘనతను తరుచూ సాధిస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.



# వార్మప్ మ్యాచ్: భారత స్పిన్నర్లు రాణించినా.. తొలిరోజు లంక ఎలెవన్ భారీ స్కోరు

శ్రీలంకతో జరగనున్న టెస్టు సిరీస్‌కు ముందు భారత జట్టు ఆడుతున్న మూడు రోజుల వార్మప్ మ్యాచ్ తొలిరోజు ఆట ముగిసింది. భారత స్పిన్నర్లు రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్ రాణించినప్పటికీ, శ్రీలంక క్రికెట్ ఎలెవన్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 8 వికెట్ల నష్టానికి 363 పరుగుల భారీ స్కోరు సాధించింది.శుక్రవారం ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంక జట్టుకు ఓపెనర్లు నిషాన్ మదుష్క (66), రవిందు రసంత (71) అద్భుతమైన ఆరంభాన్ని అందించారు. తొలి వికెట్‌కు సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పి భారత పేసర్లు మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణలపై ఆధిపత్యం చెలాయించారు. అయితే, మదుష్క రనౌట్‌గా వెనుదిరగడంతో ఈ భాగస్వామ్యానికి తెరపడింది.భోజన విరామం తర్వాత భారత స్పిన్నర్లు పుంజుకున్నారు. ఐపీఎల్ 2026 తర్వాత తొలిసారి బరిలోకి దిగిన రవీంద్ర జడేజా (2/64) కీలక వికెట్లు పడగొట్టాడు. యువ స్పిన్నర్ మానవ్ సుతార్ (2/48), కుల్దీప్ యాదవ్ (2/76) కూడా తమ స్పిన్‌తో లంక బ్యాటర్లను ఇబ్బంది పెట్టారు. ఫ్లాట్‌గా ఉన్న పిచ్‌పై స్పిన్నర్లు టర్న్ రాబట్టడంతో శ్రీలంక మిడిల్ ఆర్డర్ తడబడింది. లంక జట్టులో కెప్టెన్ సోనాల్ దినూష (52) కూడా హాఫ్ సెంచరీతో రాణించాడు. భారత బౌలర్లలో గుర్నూర్ బ్రార్ ఒక వికెట్ తీశాడు. రెగ్యులర్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ గాయం కారణంగా దూరమవడంతో ఈ మ్యాచ్‌కు కేఎల్ రాహుల్ నాయకత్వం వహిస్తున్నాడు. ఆగస్టు 15 నుంచి గాలే వేదికగా తొలి టెస్టు ప్రారంభం కానున్న నేపథ్యంలో భారత బౌలర్లకు ఇది మంచి ప్రాక్టీస్‌గా ఉపయోగపడినప్పటికీ, తొలిరోజే 360కి పైగా పరుగులు ఇవ్వడం ఆందోళన కలిగించే అంశం.




Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State, Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State. Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280